యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెనుగంచిప్రోలు: రోజూ యోగాసనాలు వేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతోపాటు మానసిక, శారీరకంగా ప్రశాంతత లభిస్తుందని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి గ్రామంలో యోగాంధ్ర అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఒత్తిడి ప్రపంచంలో యోగా ఎంతో ప్రశాంతత కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శాంతి లక్ష్మి, ఎంపీడీఓ జి.శ్రీను, ఆయుష్మాన్ వైద్యాధికారులు కె.వాణి, దుర్గామల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో...

నందిగామటౌన్: యోగాసనాల సాధన శరీరారోగ్యానికి దోహదపడటంతోపాటు ఔషధాల వాడకాన్ని తగ్గించి దేహధారుడ్యాన్ని ఇస్తుందని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయన్నారు. ముఖ్యంగా ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరు తమ దైనందన జీవితంలో యోగాను నిత్యకృత్యం చేసుకోవాలని తెలిపారు. డివిజన్ స్థాయిలో యోగాపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

గౌరవరం(జగ్గయ్యపేట): మానవ జీవితంలో యోగా భాగం కావాలని ఎంపీడీవో నితిన్ సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం గౌరవరం గ్రామంలో యోగాపై అవగాహన ర్యాలీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో



కంచికచర్లలో మానవహారంగా ఏర్పడిన ప్రజాప్రతినిధులు, అధికారులు

మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతతోపాటు శారీరిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. రోజువారీ జీవితంలో ఎదురయ్యే వత్తిళ్లను అధిగమించేందుకు యోగాసనాలు దోహదపడతాయని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరికి యోగాను చేరువ చేసేందుకు గ్రామంలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పావని వెంకటేష్, కార్యదర్శి సంక్రాంత్, సచివాలయ సిబ్బంది, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: ప్రతిఒక్కరూ ఆరోగంగా ఉండాలంటే యోగాసనాలు చేయాలని వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు పేర్కొన్నారు. యోగంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగామన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరానికి శ్రమ కలిగిస్తేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. నిత్యం కష్టపడి పని చేసే కార్మికులు, వ్యవసాయ కూలీలు ఎంతో ఆరోగ్యంగా ఉంటున్నారని గుర్తుచేశారు. ఉద్యోగులు ప్రతి ఉదయం వాకింగ్, యోగాసనాలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల రమేష్, ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్ మానస, ఇన్‌చార్జి డిప్యూటీ ఎం



నందిగామలో అవగాహన ర్యాలీ చేస్తున్న ఆర్డీవో బాలకృష్ణ, అధికారులు తదితరులు

పీడీఓ ఇందుపల్లి నానిబాబు, డ్వాక్రా సంఘ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

పరిటాలలో...

మండలంలోని పరిటాలలో స్వచ్ఛాంధ్ర కార్యాక్రమం నిర్వహించామని నానిబాబు తెలిపారు. ప్రతి ఒక్కరూ చెత్తను చెత్తసేకరణ వాహనాల సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో క్లాప్ మిత్రలు, పారిశుద్య్ధ కార్మికులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ కార్యాలయం నుంచి పాత మున్సిపల్ కార్యాలయం కూడలి వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే యోగాను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కలీముల్లా, మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా నరసింహారావు, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, గొట్టె నాగరాజు, సంగెపు బుజ్జిబాబు, ఇర్రి నరసింహారావు, కాటగాని నరసింహారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఎంపీడీవో, అధికారులు



ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ పద్మకుమారి, తహసీల్దార్ శాంతిలక్ష్మి తదితరులు



పేటలో యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది

ఆంగ్లభాషపై పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్

సీఐడీ డీఎస్పీ సునీల్

కంచికచర్ల: ఆంగ్లభాషపై పట్టు సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని గుంటూరు సీఐడీ డీఎస్పీ సునీల్ పేర్కొన్నారు. కంచికచర్ల అరుంధతీనగర్‌లో అరుంధతీయ సేవాసమితి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆదివారం రాత్రి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు మాడుగుల వర్షిత, గొర్రెపాటి కీర్తన, మాడుగుల వరుణ్‌సందేష్‌లకు నగదు బహుమతులు అందజేసి అభినందించారు. 100మంది విద్యార్థులకు బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సునీల్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఇష్టపడి చదివితే ఉన్నతమైన జీవితాన్ని అందిపుచ్చుకోవచ్చన్నారు. పేద విద్యార్థులకు అరుంధతీయసేవాసమితి అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని కొనియాడారు. తొలుత డీఎస్పీ సునీల్‌ను అరుంధతీయ సేవాసమితి



సీఐడీ డీఎస్పీ సునీల్‌ను సత్కరిస్తున్న అరుంధతీయ సేవాసమితి సభ్యులు

సభ్యులు పూలమాలలువేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి సేవా సమితి కన్వీనర్ ముండ్లపాటి పోతురాజు అధ్యక్షత వహించగా, ఇరిగేషన్ ఎండీ తిరుమలరావు, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ కె.రమేష్, సేవా సమితి కార్యదర్శి మాడుగుల వాసుబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు వేల్పుల ప్రభాకర్, నెమలి వాసు, కోశాధికారి నక్కా అంబేద్కర్, మార్కపూడి జార్జి, వేమవరపు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

సీపీకి విన్నవించిన సీపీఎం నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, సత్యంగారి హోటల్ సెంటర్‌లోని హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన బారికేడ్లు తొలగించాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కృష్ణలంక ప్రాంతంలో గత నెల రోజుల్లో రెండు యాక్సిడెంట్స్ జరిగాయని, రెగ్యులర్‌గా ప్రమాదాలకు కేంద్రంగా ఈ సెంటర్ తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. హైవేపై వాహనాలు మితిమీరిన వేగంతో నడుస్తున్నాయని చెప్పారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం సమస్యకు వాస్తవ నివారణ చర్యలు చేపట్టకుండా ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా హైవేపై బారికేడ్లు ఏర్పాటు చేశారన్నారు. వేల సంఖ్యలో కుటుంబాలు నివాసం ఉంటున్న కృష్ణలంక ప్రాంతాన్ని దిగ్బంధనం చేశారన్నారు. కేవలం చిన్న సబ్‌వే మాత్రమే నగరంలోకి వెళ్లేందుకు ఏకైక మార్గంగా ఉండటం వలన తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. హైవేపై నాలుగు చోట్ల



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

బారికేడ్లుతో మూసివేసి అటువారు ఇటు, ఇటువారు అటు వెళ్లేందుకు లేకుండా చర్యలు చేపట్టారు. అత్యవసర సమయంలోను, అంబులెన్స్ రావాలన్నా, వెళ్లాలన్నా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రమాద నివారణ చర్యలు చేపట్టి బారికేడ్లు తొలగించాలని, పోలీస్ బీట్, హైవేపై బ్లింకర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే కమిషనర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యుడు కోరాడ రమణ, స్థానిక నాయకులు గోపి, అనిల్, సిద్దు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కార్యదర్శికి సత్కారం



జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన న్యాయవాది శివరాత్రి పృథ్వీరాజ్‌ను ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు సోమవారం ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతానికి మరింత కృషిచేయాలని పృథ్వీరాజ్‌కు సూచించారు.

స్టీల్ ప్లాంట్ కార్మికులకు సంఘీభావం



తిరువూరు: విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బలగాని వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరువూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు సంఘీభావంగా, ప్రభుత్వ వైఖరికి నిరసన తెలుపుతూ ఆందోళనా కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి నోటీసులు జారీచేయకుండా అకారణంగా కార్మికులను తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఇది చట్టవ్యతిరేకమని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వెంటనే కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘ నాయకులు సామ్రాజ్యం, రమణ, కృష్ణవేణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదే

మైలవరం: విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదేనని కాకినాడ జేఎన్‌టీయూకే సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్, పూర్వ వైస్ చాన్సలర్ కేవీఎస్‌జీకే.మురళీకృష్ణ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐక్యూఏసీ, ఏఐ అండ్ డీఎస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఇన్ టీచింగ్ పెడగోగి ఆవిష్కృత బోధనాంశాల శిక్షణ అనే అంశంపై అధ్యాపకులకు ఐదు రోజులు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభంలో ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు విద్యార్థులను మంచి విద్యార్థిగా తీర్చి దిద్దాలంటే మొదట ఎలా బోధించాలో శిక్షణ పొందాలన్నారు. అధ్యాపకులకు భాష మీద మంచి పట్టు ఉండాలన్నారు. లెర్న్ నాట్ ఫర్ స్కూల్ బట్ లైఫ్ అనే స్ఫూర్తితో అధ్యాపకులు మొదట స్ఫూర్తి పొంది విద్యార్థులకు అట్టి విధానములో శిక్షణ ఇవ్వాలన్నారు. తరగతిలో నేర్చుకున్న అతి ముఖ్యవిష



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీకృష్ణ

యాలు ప్రతి క్లాస్‌లోనూ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి, కన్వీనర్‌లు ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.ఆర్.ఎల్.ప్రసాద్, డాక్టర్ పి.భగత్, కోఆర్డినేటర్‌లు డాక్టర్ ఓ రమాదేవి, ప్రొఫెసర్ ఏఐ అండ్ డీఎస్ కే సుధాకర్, వివిధ డిపార్ట్‌మెంట్‌ల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ బాలికలకు ఫైరింగ్‌లో శిక్షణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పదవ ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ గుంటూరు ఆధ్వర్యంలో కేతనకొండలోని సీబీఆర్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న శిబిరం కొనసాగుతోంది. మూడవ రోజు శిబిరాన్ని క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్ సోమవారం ప్రారంభించారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ నుంచి వచ్చిన ఏఆర్ ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు 70 ఎన్‌సీసీ కేడెట్లకు ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించి ఆయుధాల ఉపయోగంపై పలు సూచనలు, జాగ్రత్తలను వివరించారు. అనంతరం కేడెట్లను కొండపల్లి ఖిల్లాకు తీసుకువెళ్లి అక్కడి ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. ఏఎన్‌ఓ లెఫ్టినెంట్ ఎమ్ఎస్ఎన్ స్వాతి వ్యక్తిత్వ వికాసం, ఎన్‌డీఏ డిఫెన్స్ ఫోర్స్‌లో ఉన్న త్రివిధ దళాలపై అవగాహన కల్పించారు. ఈ క్యాంప్‌లో సుబేదార్ మేజర్ షేక్ ఇమామ్ సాహెబ్, ట్రైనింగ్ జేసీఓ ఆర్ఎస్ రాజు, పీఐ స్టాఫ్, క్యాంప్ సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖర్ బాబు, ఏఎన్‌ఓలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



క్లుప్తంగా

నందిగామ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నందిగామరూరల్: తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రప్రభుత్వ ప్రతిభా పురస్కారాలను అందుకోవడం సంతోషంగా ఉందని నందిగామ శ్రీచైతన్య టెక్నోస్కూల్ ప్రిన్సిపల్ రమేష్ పవారి తెలిపారు. పదోతరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన తమ విద్యార్థులు నిహారి కాత్యాయని, జయస్నేహిత, మహేంద్రలు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందుకున్నారని వివరించారు. పురస్కారాలను అందుకున్న విద్యార్థులను పాఠశాల ఆవరణలో సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



నందిగామరూరల్: విద్యార్థులు క్రమశిక్షణ, శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని మాజీమంత్రి వసంత నాగేశ్వరరావు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోస్టర్ తయారీ పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మండలంలోని ఐతవరం గ్రామంలో సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా గ్రామానికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ కనబరచడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ కోట వీరబాబు, ప్రధానోపాధ్యాయుడు బుడి నరేంద్ర, గైడ్ టీచర్ బండారు లక్ష్మీనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా తిరునక్షత్ర వేడుకలు

నందిగామటౌన్: పట్టణంలో వేంచేసియున్న సీతారామాంజనేయస్వామి ఆలయంలో సోమవారం నమ్మాళ్వార్ తిరునక్షత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో నరసింహమూర్తి ఆధ్వర్యంలో అర్చకుడు దివి శశివంశీకృష్ణమాచార్యులు స్వామి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ముందుగా నమ్మాల్వార్ ఉత్సవమూర్తులకు తిరువంజనం, అష్టోత్తర సహస్రనామ పూజలు, మల్లెలార్చన పూజలను వేదోక్తంగా జరిపించారు. అనంతరం ఆండాల్ ఘోష్టి సభ్యులు తిరువాయిముడి పారాయణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



నందిగామరూరల్: పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారిని అర్చకుడు వైఎస్ఆర్‌కె ప్రసాద్ ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 17 అర్జీలు

నందిగామరూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 17 అర్జీలు అందాయని ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి ఏడు, పంచాయతీ రాజ్ శాఖకు రెండు, సర్వేశాఖకు ఐదు, విద్యా శాఖ ఒకటి, పోలీస్‌శాఖ ఒకటి, ఏపీ ఫైబర్‌కు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు వివరించారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

వీరులపాడు: మహిళలు కుట్టుశిక్షణతో ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని జనశిక్షణా జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణిమ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరులో టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ చాంద్‌బేగం ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణనివ్వడం అభినందనీయమని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే కుటుంబం ఆర్థిక పురోగతిని సాధిస్తుందని పేర్కొన్నారు. సర్పంచ్ రమావత్ కోటి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనసత్కారం

నందిగామరూరల్: మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆలపాటి గోపీనాథ్ యూపీఎస్‌సీ నిర్వహించిన ఐఎఫ్ఎస్-2024 పరీక్షల్లో 55వ ర్యాంకు సాధించారు. ఈసందర్భంగా గోపీనాథ్‌ను జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే బొడ్డులూరి రామారావు అభినందించారు. అదేవిధంగా ఇటీవల ఏపీపీగా నియమితులైన కాత్ర సత్యనారాయణను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లెకంటి అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు అబ్బూరి నాగమణి, శాఖమూరు స్వర్ణలత, కాత్ర అప్పారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటు అభినందనీయం

మంత్రి సత్యకుమార్ యాదవ్

జగ్గయ్యపేట అర్బన్: ధర్మరక్షణ కోసం పోరాడిన మహనీయుల జీవితచరిత్ర నేటి తరాలకు తెలిసేలా జగ్గయ్యపేట పట్టణంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్ర వైద్య విద్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పట్టణంలోని విజయవాడ రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. తొలుత చాముండేశ్వరి పీఠాధిపతులు శ్రీకమలానంద భారతి స్వామివారు, శైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీశివస్వామి, గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రిలతో కలిసి పూజలు చేశారు. శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక పట్టణంలో ఇటువంటి మహనీయుని విగ్రహం ఏర్పాటు చేసిన హిందూ చైతన్య వేదిక, విగ్రహం నిర్మాణ కమిటీ ప్రతినిధులు పిన్నం వెంగళరావు, నోములు రఘు, సంకా భాస్కర్, పబ్బతి నరేంద్ర, అల్లి రవిచంద్‌లను అభినందించారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు ఆనందదాయకమన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం



ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్, తాతయ్య, రఘురాం

రఘురాం మాట్లాడుతూ హిందూ ధర్మరక్షకులుగా, పోరాట యోధుడిగా ఛత్రపతి శివాజీ మహరాజ్ భారతదేశ చరిత్రలో నిలిచిపోయారన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర ప్రసంగించారు. విగ్రహం నిర్మాణానికి అత్యధికంగా విరాళాన్ని అందించిన జగ్‌తాప్ విష్ణువర్ధన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజాలను మంత్రి సత్యకుమార్ యాదవ్, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు శ్రీరాం చినబాబు, శివాజీ మహరాజ్ అభిమానులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

నందిగామటౌన్: కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల పేరుతో చేస్తున్న దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపినాయక్ డిమాండ్ చేశారు. అధిక ఫీజులను నియంత్రించడంతో పాటు అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం నందిగామ ఆర్డీవో బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గోపినాయక్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను హడలెత్తిస్తున్నాయన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని వివరించారు. ఎల్‌కేజీకి సైతం లక్ష రూపా



ఆర్డీవో బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యలను వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులనే వసూలు చేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహ, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని మంత్రికి వినతి

జగ్గయ్యపేటఅర్బన్: తమకు జీతాలు చెల్లించాలని కోరుతూ జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రి పారిశుద్య సిబ్బంది సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణకు హాజరైన మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను పారిశుద్య సిబ్బంది కలిసి వినతిపత్రం అందజేశారు. తాము ఆరేళ్లుగా ప్రభుత్వాస్పత్రిలో కార్మికులుగా పనిచేస్తున్నామన్నారు. మూడునెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే సమయం దగ్గర పడుతుండటంతో పిల్లలు యూనిఫాం, పుస్తకాలు కొనేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ నెలల జీతాలతోపాటు ప్రతినెల జీతాలు సకాలంలో వచ్చేలా చర్యలు తీసు



మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వాస్పత్రి పారిశుద్ధ్య కార్మికులు

కోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి పారిశుద్య కార్మికులు సీహెచ్.జయమ్మ, ఎం.వీరమ్మ, ఎస్.త్రివేణి, కె.హేమలత, కె.కృష్ణ, ఇ.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు :ఎమ్మెల్యే

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే అతిథి గృహాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గ ప్రణాళికలు తయారు చేయటం, అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో అభివృద్ధి ప్రణాళికలను చర్చించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, ఈవోపీఆర్డీ పద్మావతి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వ్యాస సంకలనం ఆవిష్కరణ



మైలవరం: తెలుగు సాహిత్యంలో అంబేడ్కర్ మనుస్మృతి అనే ప్రత్యేక వ్యాస సంకలనాన్ని ప్రముఖ విద్యావేత్తలు సోమవారం ఆవిష్కరించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలోని అంబేడ్కర్ స్మృతి వనంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాదముల వద్ద ఈ ప్రత్యేక వ్యాస సంకలనాన్ని మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, ఇతర విద్యావేత్తలతో కలిసి ఆవిష్కరించినట్లు సంపాదకుడు డాక్టర్ మెండా దేవానంద్‌కుమార్ తెలిపారు. అంబేడ్కర్ ఆశయాలు ఎంతో మహోన్నతమైనవని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. తాను 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ సామాజిక దృక్పథాలు' అనే వ్యాసం రాయడం గొప్ప ఆనందాన్ని కలిగించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల గొంతుకై అంబేడ్కర్ నిలబడిన తీరు అమోఘం అన్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య కొండపల్లి సుదర్శన్‌రాజు మాట్లాడుతూ సరైన సమయంలో సరైన వ్యాస సంకలనం ఇది అన్నారు. ఈ వ్యాస సంకలనంలో తొలి తరం దళిత కవులను స్మరించి వారి రచనల గూర్చి రచనావ్యాసాంగాలు చేయడం అద్భుతం అన్నారు. బి.వీణ, గౌరవ సంపాదకులు డాక్టర్ పీ నాగయ్య, డాక్టర్ మెండా దేవనందకుమార్ ప్రసంగించారు.